# వివేకం

సూరంపూడి వేంకటేశ్వరరావు

'కాలేజీ నుంచి ఇంటికొచ్చిన సూరిబాబు ఏమయ్యాడు' అనుకుంటూ పావుగంట సేపు ఇల్లంతా వెతికి చివరికి డాబామీది కొచ్చింది శారద. డాబామీద ఓ మూల ఒంటరిగా కూర్చుని దీక్షగా ఏదో పుస్తకంలోకి చూస్తున్న సూరిబాబుని చూసి పిలవబోయి ఓ క్షణం ఆగింది. 'ఎన్నడూ లేనంత శ్రద్ధ వీడికిప్పుడెందు కొచ్చిందో' అనే కుతూహలంతో నిశ్శబ్దంగా సూరిబాబు వెనక్కి వెళ్ళి ముందుకు తొంగి చూసింది. శారద ఒళ్ళు ఒక్కసారిగా వేడెక్కిపోయింది. అసహ్యం జుగుప్స. పట్టరాని ఉద్రేకంతో నరనరాలూ పొంగి ఒళ్ళు భగ్గున మండినట్టయింది.

"ఛీ" అంటూ చటుక్కున వాడి చేతిలోని పుస్తకం లాక్కుంది శారద. ఈ హఠాత్పరిణామానికి ఉలిక్కిపడి లేచి నిల్చున్నాడు సూరిబాబు. ఎదురుగా శారదక్కయ్య కనబడగానే నిశ్చేష్టుడయి నిలబడిపోయాడు సిగ్గు, అవమానం, భయం ముంచుకు రాగా తలవంచుకుని బిత్తర చూపులు చూడసాగాడు.

"ఇదన్నమాట ఇక్కడ ఒంటరిగా కూచుని నువ్వు చేసే నిరవాకం. నీ కాలేజీ చదువు ఇందుకుపయోగ పడుతోందన్నమాట". తీక్షణమైన అక్కయ్య మాటలకి తట్టుకోలేక ముఖం తిప్పుకున్నాడు సూరిబాబు.

"ఏరా మాట్లాడవేం? వయసొచ్చినందుకు వేసే వెర్రి మొర్రి వేషాలివా? నువ్వేదో చదువుకుని బాగుపడుతున్నావు అందరిలోకీ పెద్ద చదువుతో మంచి సంస్కారంతో వంశాన్నీ దేశాన్నీ ఉద్ధరిస్తావని ఇన్నాళ్ళూ నేనాశించడమంతా పొరబాటని. నా అంచనా లింతగా తప్పుతాయని ఎన్నడూ అనుకోలేదు. నీ క్లాసు పుస్తకాలెప్పుడేనా ఇంత శ్రద్ధగా చదివావా? ఇంట్లో తక్కినవాళ్ళు ఎంత అవస్థ పడుతున్నారో ఎన్ని బాధ్యతలు మోస్తున్నారో ఎప్పుడేనా ఆలోచించావా? చదువుకునేవాడివి గదా ఎందుకనవసరంగా ఇంటిపనులు చెప్పడం అని ఊరుకుంటూంటే నీ బాధ్యతలు నువ్వు గుర్తించకపోగా ఇలా చెడిపోతావని తెలుసుకోలేకపోయాను" గుక్క తిప్పుకోకుండా ఏకధాటిగా అనేసింది శారద.

అక్కయ్య ముఖంలో ఇదివరకెన్నడూ చూడని కోపం, అక్కయ్య నోటమ్మట ఎప్పుడూ వినని ఇంత పరుషమైన వచనాలానికి సూరిబాబు ఆత్మాభిమానం దెబ్బతింది. భరించలేని ఈ అవమానం అతనిలో మూర్ఖమైన పౌరుషాన్ని రగుల్కొలిపింది. విసురుగా తల తిప్పి "అసలు నువ్విక్కడి కెందుకొచ్చావ్? నేనేం చేస్తున్నానో రహస్యంగా పసిగట్టవలసిన అవసరం నీకేం వచ్చింది?" అన్నాడు. రోషంతో గొంతు పూడుకుపోయింది సూరిబాబుకి.

"ఛీ-ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నావు. నీ వెనకాల గస్తీ తిరగాల్సిన గతి నాకు ఇంతవరకూ పట్టలేదు. కాని ఇక ముందు అలాంటి పరిస్థితి తప్పనిసరిగా కలిపించేటట్లున్నావ్ నువ్వే. అసలు ఇంట్లో పరిస్థితి ఏమిటో ఎవరు ఎలా వున్నారో ఎప్పుడైనా పట్టిందా నీకు? రేపు తినడానికి బియ్యంలేవు. స్టోర్సు దగ్గర గంటల తరబడి క్యూలో నిలబడితేగాని నాలుగు గింజలు చిక్కడం దొరకవాయె. ఇంట్లో మిగతా సరుకులు కూడా నిండుకున్నాయి. స్టవ్ అంటించి తమరికి కాఫీలుకాచి ఇవ్వడానికి కిరసనాయిలు అయిపోయింది. ఇవన్నీ ఎవరు తెస్తారు? ఈడొచ్చిన పిల్లాడివి కాస్త ఇంటిపని సాయంచేస్తావేమోనంటే బలాదూరుగా తిరగడం పని తప్పించుకోవడం అలవాటయింది నీకు. కాస్త నువు కల్పించుకుని చెయ్యకపోతే ఎలా? అందరూ బతకాలావద్దా?" అంది శారద.


"నా కోసం, నా మూలంగా అంతగా చచ్చేవాళ్ళయితే నేనిప్పుడే అవతలకి పోతాను. మీరే సుఖంగా వుండండి" అన్నాడు సూరిబాబు.

"ఏం బెదిరిస్తున్నావా?"

"అసలు నా సొంత విషయాల్లో జోక్యం చేసుకునే అధికారం నీకెక్కడుంది? నా పుస్తకం ముందు నాకియ్యి అని ఉక్రోషంతో శారద చేతిలోని పుస్తకం లాక్కోబోయాడు సూరిబాబు. చెంపమీద బలంగా ఈడ్చి ఒక్కటిచ్చింది శారద. తల దిమ్మ తిరిగినట్లయి కూలబడ్డాడు సూరిబాబు. కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి. "సరే. ఒక్క క్షణం ఈ ఇంట్లో వుండను నేను" అంటూ లేచి చరచరా వెళ్ళిపోయాడు.

కందిపోయిన తన అరచేతిని చూసుకుని దీర్ఘంగా నిట్టూర్చింది శారద. ఇన్నాళ్ళూ ఎప్పుడూ చేయి చేసుకోకుండా అల్లారు ముద్దుగా చూసిన తను ఇవాళ వాడినింత దెబ్బ కొట్టానే అనే బాధతో మూల్గింది ఆమె హృదయం. కాని తనచేతిలోని బూతు పుస్తకం! ఛీ అని వెగటుతోటి కింద పడేసింది శారద. వయసు వచ్చిన వాడికి చెడిపోవడానికి మార్గాలనేకం. పదహారేళ్ళు వచ్చిన ప్రతి మనిషీ ఈ మార్గాలకోసం ఎందుకు వెతుకుతాడో, ప్రపంచమంతా వాళ్ళ మోహించడం కోసం పుట్టిందనే పిచ్చి భ్రమలోపడి ఎందుకిలా మారిపోతారో, భవిష్యత్తుని నాశనం చేసుకుంటారో అర్థం కాని విషయం. నాగరికులూ విద్యా

సూరిబాబు చిన్నప్పుడే వాళ్ళమ్మ చనిపోయింది తండ్రి ధైర్యంగా కుటుంబాన్ని నిలద్రొక్కుకొస్తున్నాడు సూరి అన్నయ్య ఖరగ్‌పూర్‌లో ఇంజనీరు పెళ్ళయి రెండేళ్ళయినా తిరక్కుండానే మాంగల్యంపోగొట్టుకుని పుట్టింటికి తిరిగివచ్చింది శారద అమె భర్త యుద్ధంలో మరణించాడు




వింతులూని అనిపించుకుంటే ఏం లాభం సంస్కార హీనులయినపుడు !

యౌవ్వన మనేది విరబూసిన పువ్వులాంటిది. గాలికెటుపడితే అటు ఊగుతూ కాశ్కాలి కోల్లాస దోలికల్లో తేలినా మరికొద్ది సేపటిలో రేకలు ఊడి శుష్కించి నేల రాలిపోతుంది ఆ పువ్వు. పుష్పానికి సరియైన బీజం పడి ఫలించేది అరుదు వందలకొద్దీ పూవుల్లో ఒకటి రెండు మాత్రమే రాలినతర్వాత కూడా లోకానికి సేవ చేస్తున్నాయి. జీవితాన్ని మలుచుకోవలసిన ఈ కాలమూ అంతే. అనుదినం ఎన్నో రంగులు ఎన్నో వింతలు ఎన్నో కోరికలు చుట్టూ అలుముకుని మనసుని ఊపుతూ వుంటాయి. స్థిరంగా నిలదొక్కుకుని జీవితాన్ని అర్థం చేసుకుని నడిచే యువతరం వుంటే దేశం ఇంత అధోగతి పాలయ్యేదా? ఇన్ని సమస్యలు ఉత్పన్నమయేవా? వీళ్ళకి జ్ఞానం వచ్చేదెలా? గాఢంగా నిట్టూర్చింది శాంత. చివరికి సూరి కూడా అందరిలో ఒకడై పోతున్నాడు అమ్మ పోయిన్నాటినుంచీ వాణ్ణి తో గారాబంగా పెంచింది తను. తెలివైనవాడు, ప్రయోజకుడై ఉద్ధరిస్తాడని కలలుగంది. కాని చివరికీనాడు

బూతుబొమ్మల పుస్తకాలని. దీక్షగా చదివే మొనగాడయినాడు. చిన్నప్పటినుండీ నాన్నగా ఇచ్చిన స్వతంత్రంతో అలుసు తీసుకుని ఇష్ట మొచ్చినట్టు తిరుగుతున్నాడు సూరి ధరలు ఆకాశాన్నంటి తింటిగింజలు దొరక్క గుట్టుగా పొదుపుగా కాపురం సాగిస్తున్నా జరిగేటట్లులేదు. ఎప్పుడూ సినిమాలకీ, నాటకాలకీ తిరగడంతో అనవసరపు ఖర్చులు పెంచుతున్నాడు సూరి. అడిగితే బాధపడతాడని ఏమీ అనదు శారద.

సూరిబాబు చిన్నప్పుడే వాళ్ళమ్మ చని పోయింది. తండ్రి ధైర్యంగా కుటుంబాన్ని నిలద్రొక్కుకొస్తున్నాడు సూరి అన్నయ్య ఖరగ్‌పూర్‌లో ఇంజనీరు. పెళ్ళయి రెండే ళ్ళయినా తిరక్కుండానే మాంగల్యం పోగొట్టు కుని పుట్టింటికి తిరిగి వచ్చింది శారద.

ఆమె భర్త మిలటరీ ఆఫీసర్‌గా వుండి బంగ్లా యుద్ధంలో మరణించాడు. ఇలాంటి కుటుంబ పరిస్థితిలో సూరి బాగా చదువు కుంటారనీ ఎంతో వృద్ధిలోకి వస్తాడనీ ఆశ పడింది శారద. కాని వాడికి ఇంటి బాధ్యత లేవీ పట్టేటట్లు లేవు. ఇప్పుడు రహస్యంగా బూతుపుస్తకాలు చదవడానికలవాటు పడ్డవాడు ముందు ముందు ఇంకెలా చెడిపోతాడో. పుస్తకం మాట జ్ఞాపకం రాగానే తిరిగి అసహ్య మేసింది శారదకి. చింపి ముక్కలు చేయాలని చేతిలోకి తీసుకుంది. కాని- సూరిబాబులో స్వత హాగా మార్పురావాలి. కేవలం విజ్ఞానం కోసం సెక్సుని శాస్త్రీయంగా అధ్యయనం చేయడం మంచిదే-కాని ఇలా నైతిక విలువల్ని హీన పరచి మనుషుల్ని పతనం జేయగల నీచమైన సాహిత్యం చదడం వాస్తవానికి దూరమై క్షణికపు బలహీనతలకి లోనుగావడం కాకూడదు అది వాడు అర్థం చేసుకోవాలి. ఎంత డబ్బుపోసి ఖరీదైన ఈ చెత్తని కొన్నాడో, దీని అసలు విలువ తెలిసి వాడే దీన్ని నాశనం చెయ్యాలి అప్పుడే తనకు తృప్తి అనుకుని పదిలంగా దాచింది శారద.

భోజనాల సమయంలో నాన్నగారు 'సూరి బాబేడి' అని అడిగారు. "చదువుకోడానికి స్నేహితుడింటికి వెళ్ళాడు" అబద్ధమాడింది శారద తృప్తిగా నవ్వుకున్నారాయన. శారద మనసులో బెరుకు పట్టుకుంది. ఈ ఇంట్లో వుండనని పోయాడు సూరిబాబు. తిరిగి వస్తాడో రాడో? వాడొచ్చేవరకు తాను కూడ భోజనం చేయకూడదని నిశ్చయించుకుంది శారద.

* * *

సూరిబాబు ఇంటినించిపోయి తిన్నగావెళ్ళి పార్కులో కూర్చున్నాడు. అవమానంతో అతని హృదయం భగ్గుమంటోంది. తన స్వవిషయంలో అనవసరంగా జోక్యం చేసు కుంది అక్కయ్య. ఇంకా అందరూ తను చెప్పినట్టు తు.చ. తప్పకుండా పాటించాలని అధి కారం చెలాయిస్తోంది. చాలారోజుల్నించి వెతుకు తున్న పుస్తకం చివరికిదొరికింది. బస్సు స్టాండ్ పక్క 'నవలా లైబ్రరీ' వాడి దగ్గర బేరమాడి పదిహేరు రూపాయలుపెట్టి కొన్నాడు. దాన్నేం చేస్తుందో ఇప్పుడు. నాన్నగారికి చెబుతుందా? గుండెలు దడదడలాడాయి. పుస్తకంలో వి ఫొటోలు. బొమ్మలు కథలు నాన్నగారు చూస్తే ఇంకేమన్నా వుందీ? సూరికి అశాంతి ఎక్కు వయింది. మనసు పిచ్చిగా వుంది. ఏదయినా సినిమాకు పోతే! జేబులో డబ్బులు చూసు కున్నాడు. దగ్గర్లోవున్న ఒక స్నేహితుడి రూముకి వెళ్ళాడు. స్నేహితుడు మరో ఇద్దరు క్లాస్‌మేట్స్‌తో కలిసి ఆల్జీబ్రా చేస్తున్నాడు. "ఒరే రామం సినిమా కెడదాం పదరా" అన్నాడు సూరిబాబు ఆ ముగ్గురూ తలెత్తి సూరి బాబుకేసి వింతమృగాన్ని చూసినట్లు చూసి నవ్వారు.

"నీకేం మతిగాని పోలేదు గద పరీక్షలు దగ్గర పడుతోంటే ఇప్పుడు నీకీ సినిమాల పిచ్చేమిటి" అన్నారు వాళ్ళు. సూరిబాబు తిట్టు కున్నాడు తనని వాళ్ళర్థం చేసుకోనందుకు.

"పోనీ నేడబ్బెట్టుకుంటారా" అన్నాడు.

"చాల్లాల్లే. ఆ డబ్బు లిలా యియ్యి. లెక్కలకి పుస్తకాలు చాలటంలేదు. కొనుక్కుం టాం" అన్నాడు రామం.

మరకాస్సేపక్కడ కూర్చుని వాళ్ళు తనని పట్టించుకోకపోవడంతో విసుక్కుంటూ లేచి వచ్చాడు సూరిబాబు.

రోడ్డుమీద పోయే జనాన్ని చూస్తూ పాన్ షాప్ వాడి రేడియో వింటూ కాస్సేపు గడి పాడు సూరిబాబు. అదికూడా విసుగు పెట్ట డంతో పిచ్చెత్తినట్టు తిరిగి ఇరానీ హోటల్‌లో సమోసా తిని టీ తాగి రెండోఆట సినిమాకి వెళ్ళాడు.

సినిమాలో సూరిబాబుకి కావలసిన మసాలా కాస్త వుంది. కొంచెం రిలీఫ్.

సినిమా వదిలారు. రాత్రి ఒంటి గంటయింది. అక్కడక్కడ సినిమా వదిలిన జనం సర్దుకుని వల్చబడుతున్నారు. వీధులు క్రమంగానిర్మానుష్యమవుతున్నాయి నెమ్మదిగా



### ఓసారి

"ఈ హాల్లో ఏ చిత్రం ఆడుతోంది బాబూ...." అడిగాడు దారిన పోయే ఆసామీ, గిరిని.

"డబ్బు...డబ్బు.. డబ్బు" చెప్పాడు గిరి.

"ఓసారి చెబితే తెలుస్తుందిలే" అన్నాడా ఆసామీ విసుగ్గా.

—ఎస్. సుధాకరరావు (సికింద్రాబాద్)

### పథకం

### ✱అయ్యేన్సార్✱



నడుస్తున్న సూరిబాబుని చకచకా కాలిజోళ్ళ చప్పుడుతో తనను దాటి వెడుతున్న ఓ అమ్మాయి కనబడింది. స్కర్ట్‌తో చేతిలో బాగ్‌తో ఆంగ్లో యిండియన్‌లా కనిపిస్తున్న ఆ అమ్మాయిని చూడగానే సూరిబాబు కళ్ళెదుట తాను చదివిన విన్న కథల దృశ్యాలు సినిమా రీలులా తిరగడంతో వెంబడించసాగాడు. కొంతదూరం పోయి వెనక్కి తిరిగిన ఆ అమ్మాయి అతని వెకిలిచేష్టలు చూసి కాలిజోడు చేతిలోకి తీసుకుంది. గుండె దడదడలాడి ముచ్చెమటలు పోయగా సూరిబాబు వెనక్కి తిరిగాడు. వాడికేం తెలుసు-నైట్ షిఫ్ట్ ఉద్యోగాలు తప్పనిసరి చేసి ధైర్యంగా ఇంటికెళ్ళే ఆడవాళ్ళుంటారనీ ఒక జాతి మనుషులనీ లోకువగా చూడకూడదనీ.

దారిలో బీట్ కానిస్టేబిల్‌ని చూసిన సూరిబాబుకి వెంటనే ఒక సంగతి జ్ఞాపకం వచ్చింది. ఇటీవలి దొంగతనాల దృష్ట్యా రాత్రి ఒంటిగంట దాటిన తర్వాత వీధిలో తిరిగే వాళ్ళని అనుమానిస్తే పోలీసులు కష్టడీలోకి తీసుకుంటున్నారు. ఈ మధ్య పోలీస్ 'టాస్క్‌ఫోర్స్' చాలా తీవ్రంగా పనిచేస్తోంది.

సూరిబాబుకి ఒక్కసారిగా నీరసం ముంచుకు వచ్చింది. తాను పుస్తకాల్లో చదివిన రంగుల లోకాలకీ, కోతలరాయుళ్ళ వద్ద విన్న వాటికీ, వాస్తవానికీ అనుభవంలో ఎంత తేడా వుందో తెలిసి వచ్చింది.

సూరిబాబు ఆలోచనలతో అడుగులు తడబడుతూంటే దగ్గరికి రానే వచ్చాడు పోలీస్ కానిస్టేబుల్. "ఇక్కడెందుకు పచార్లు చేస్తున్నావ్ ఈ టైమ్‌లో. ఎవర్నువ్వు" అని నిలదీసి అడిగాడు.

సూరిబాబు తడబడుతూ పరీక్షలకని చదువుకోడానికి స్నేహితుడి దగ్గరికొచ్చాననీ ఏదో 'ప్రశ్న' సమాధానం ఆలోచిస్తూ మెల్లిగా ఇంటికెడుతున్నాననీ చెప్పాడు. 'ఏ క్లాసు, ఏ కాలేజీ' వగైరా అడిగి సూరి వాలకం చూసి త్వరగా పొమ్మని హెచ్చరించి వదిలాడు కానిస్టేబుల్.

సూరిబాబుకి తక్షణం ఇంటి విలువ తెలిసి వచ్చింది. ఎంత త్వరగా ఇల్లు చేరుకుంటే అంత మంచిదనిపించింది. ఇంటిని మించిన ఆశ్రయం మరొకటి లేదని తోచింది. తిండీ విశ్రాంతీ లేక నీరసంగావున్నా ఇంటికెళ్ళడం కోసం అతను దాదాపు పరిగెత్తాడు.

తనకోసమే ఎదురు చూస్తూ గుమ్మం దగ్గర కాపెట్టుకుని కూర్చుని వుంది శారదక్కయ్య. సూరిబాబు రాగానే భుజంమీద చేయివేసి ఏమీ అనకుండా లోపలికి తీసికెళ్ళింది. అన్నం కలిపి తానే ముద్దలు చేసి తినిపించింది. చిన్న పిల్లాడిలా ఆమె ఒడిలో ఒదిగి కూర్చున్నాడు సూరిబాబు.

పెరుగన్నం కలుపుతూ "సూరీ" అని పిలిచింది శారద.

"ఒక్కసారి తలెత్తి నా ముఖం వంక చూడు. నాకీ వైధవ్యం ఎలా ప్రాప్తించిందో తెలుసుగా మీ బావగారు మిలిటరీ ఆఫీసర్‌గా దేశం కోసం ప్రాణాలర్పించారు. ఆయన ఎన్నడూ కర్తవ్యాన్ని మరువలేదు. ధన్యజీవిలా వెళ్ళిపోయారు. ఏకాకినైన నేను వాళ్ళింట్లో కాని ఇక్కడ ఈ ఇంట్లో ఇలా పడివున్నానంటే నాకు గతిలేక కాదు. ఎవరిసాయమూ తోడూ లేకపోయినా నా మానాన నేను ఏ ఉద్యోగమో చేసుకుంటూ లేక ఏ ఆశ్రమంలోనో సేవా సంఘంలోనో గడిపివేయగలను. నాకు రోజులు గడవకపోవు. కాని తలదిక్కులేని ఈ కొంపలో నాన్నగార్కి పెద్దతనంలో సేవ చెయ్యాల్సిన బాధ్యతా, నీ సంరక్షణ బాధ్యతా నాకు వున్నాయి అనిపించింది. అవి నిర్వర్తించక బయట లోకానికి సేవ చేస్తాననడం హాస్యాస్పదంగా వుంటుంది. నీ అన్నయ్య మంచి ఉద్యోగంలో వుండి ఇంజనీరుగా దేశసేవ చేస్తూ వాడి బ్రతుకు వాడు బ్రతుకుతున్నాడు. తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మరి నీ బాధ్యత ఎప్పుడైనా గుర్తించావా నువ్వు? నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తిస్తున్నావా? నువ్వేకాదు నీ వయసులో అనేకమంది ఇలాగే జీవితాన్ని అర్థం చేసుకోలేక చెడిపోతున్నారు. ప్రపంచంలో ప్రతి దాన్నుంచీ నేర్చుకోవాల్సిందెంతేనా వుంది. సంఘంలో ఎన్నో దురాచారాలూ దురలవాట్లూ నిండివున్నాయి. ప్రజలకి జీవితావసరాలు కరువవుతున్నాయి. దేశం పురోగమించాలంటే ఈ లోపాలు రూపుమాపాలి. అందుకు కావలసిన విజ్ఞానం ఇప్పుడే అలవర్చుకోవాలి. ముందు ప్రతివాడూ తనని తాను సంస్కరించుకోవాలి. ఏవో పుస్తకాలు చదివినంత మాత్రానే చెడిపోతావని చెడిపోయావనీ కాదు. కాని నువ్వెవరివో నీ వల్ల ఇతరులకేం వుపయోగమో నీ జీవితానికి ప్రయోజనమేమిటో అనుభవపూర్వకంగా తెలుసుకోనంత కాలం ఈ పుస్తకాలు నిన్నెన్నటికీ ఉద్ధరించలేకపోగా అవినీతికి దోహదమిస్తాయి. పెద్దవాడివవుతున్నావు. నీలో ఆలోచించే శక్తిని అనవసర విషయాలపై వ్యర్థం చేసుకోవద్దని నా సలహా. చెప్పవలసిందేదో చెప్పాను. ఇక నీ ఇష్టం ఇదిగో నీ ఖరీదైన కలల పుస్తకం తీసికో" అంటూ తెచ్చియిచ్చింది శారద.

సూరిబాబు కళ్ళమ్మట నీళ్ళు జలజల రాలాయి.

"అక్కా నన్ను క్షమించవూ నిన్నపార్థం చేసుకొన్నాను" అంటూ ఆమె పాదాలు పట్టుకున్నాడు. పుస్తకం తీసుకుని అగ్గిపుల్ల గీసి అంటించాడు. అతని అజ్ఞానం లాంటి ఆ పుస్తకం భగభగ మండి నుసి అవుతుంటే సూరిబాబు ముఖం వివేకంతోనూ శారద ముఖం తృప్తితోనూ వెలిగాయి. ✱


## ఇది మీకు చాలా ఉపయోగం

మానవ వ్యవహారాలకు "వ్యవహారదర్శిని" అనే తెలుగుపుస్తకం చాలా ఉపయోగం. అందులో ఏదైనా ఆస్తి కొనేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనా ఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే, దేనికెవరి వద్ద ఎలా లైసెన్సు తీసుకోవాలి, వివిధ జాతుల వివాహ, విడాకుల నిబంధనలు, స్త్రీ పురుషుల ఆస్తి హక్కులు, ఎవరితోనైనా ప్రమాదం రాబోతే పోలీసు సంరక్షణకు ఎవరికెలా వ్రాయాలి. ప్రభుత్వ ఉచిత ఇండ్లస్థలాలు పొందటానికి ఎవరికెలా దరఖాస్తు వ్రాసి పంపుకోవాలి, నోట్లు, దస్తావేజులు, ఒప్పందాలు, పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలా వ్రాయాలి వాటి వివిధ నమూనాలు, అనేక చట్టాల వివరాలు ఇలాంటివెన్నో మీకు ఉపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300 పేజీల పుస్తకం. ధర రూ. 12. పోష్టు ఖర్చులు అదనం. దేశసేవ ప్రచురణలు, 2. ఇందిరానగరు, వెంగళరావు నగరు వద్ద, హైదరాబాదు-500830 కు ఉత్తరం వ్రాసి మీ ఉపయోగానికో పుస్తకం వి.పి. పోష్టుద్వారా పొందండి